క్లుప్తంగా

భూమితోనే మానవ మనుగడ



ధరిత్రీ దినోత్సవంలో మాట్లాడుతున్న బ్రహ్మకుమారీస్ జిల్లా ఇన్‌చార్జ్ అన్నపూర్ణ

విజయనగరం టౌన్: మానవ మనుగడ భూమిపైనే ఆధారపడి ఉందని బ్రహ్మకుమారీస్ సంస్థ జిల్లా ఇన్‌చార్జ్ బీకే అన్నపూర్ణ అన్నారు. స్థానిక కంటోన్మెంట్‌లో ఉన్న బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ సేవా కేంద్రంలో సోమవారం ధరిత్రీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మనుషుల్లో అశాంతి, దుఃఖం, అశుద్ధత, అపవిత్రత పెరిగిపోవడంతో వాటి ప్రభావం భూమిపై పడి కాలుష్యమైందన్నారు. మానవుడు మనుగడ సాధించాలంటే భూమిని కాపాడుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో బ్రహ్మకుమారీలు, స్థానికులు, సేవకులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులను నమ్మవద్దు..

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ రూపాల్లో పన్నులు చెల్లించాల్సిన యజమానులు అపరిచిత వ్యక్తులను నమ్మి మోసపోవద్దని కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా డీఅండ్‌ఓ, ట్రేడ్ లైసెన్స్‌లకు సంబంధించిన ఫీజులు చెల్లింపుల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇటీవల కొందరు అనధికారిక వ్యక్తులు ఫీజులు పేరిట మోసం చేసే ప్రయత్నాలు తమ దృష్టికి వచ్చాయన్నారు. చెల్లింపుదారులు నేరుగా వచ్చి కార్పొరేషన్ కార్యాలయంలో లేని పక్షంలో ఆన్‌లైన్‌లో ఫీజు రుసుం చెల్లించాలని సూచించారు.

28న సివిల్స్ పరీక్షలపై అవగాహన సదస్సు

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో ఈ నెల 28వ తేదీన సివిల్ సర్వీసెస్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని లోలుగు సుశీల మెమోరియల్ ఫౌండేషన్ అధినేత లోలుగు మదన్ ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. ఫౌండేషన్ స్థాపించి, ఏడాది పూర్తికావస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్, వివిధ రంగాల్లోని ప్రముఖులు హాజరు కానున్నారన్నారు. మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి, యువతకు నైపుణ్య శిక్షణ, మెరిట్ సాధించే పేద బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేయడం లక్ష్యంగా ఫౌండేషన్ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా 8 మంది మెరిట్ విద్యార్థులకు ఢిల్లీలోని నెక్స్ ఐఏఎస్ అకాడమీలో శిక్షణ అందించామన్నారు.

తలే రాజేష్ నామినేషన్‌కు తరలిరండి

వంగర: వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ నామినేషన్ కార్యక్రమానికి పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, మండల జేసీఎస్ కన్వీనర్ కిమిడి ఉమామహేశ్వరరావు కోరారు. ఇదే విషయమై విలేకరులతో సోమవారం మాట్లాడిన ఆయన ఈ నెల 24వ తేదీన జరిగే నామినేషన్‌కు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ శ్రేణులు హాజరై, అభ్యర్థి బలాన్ని చాటాలన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



కార్యక్రమంలో పాల్గొన్న చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర, వేణుగోపాలనాయుడు

బొబ్బిలి: మండలంలోని పిరిడి గ్రామంలో శ్రీలక్ష్మీగణపతి ఆలయ నిర్మాణానికి చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శంబంగి వేణుగోపాలనాయుడులు సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బొత్స కాశినాయుడు, సర్పంచ్ తుట్ట వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న దాతలు

రాజాం సిటీ: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని నైరెడ్ డైరెక్టర్ ఎం.రాజేష్ అన్నారు. సోమవారం స్థానిక నైరెడ్‌లో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా బ్లడ్‌బ్యాంకుల్లో నిల్వలు పెంచేందుకు నైరెడ్ శిక్షణార్థులచే శిబిరం నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రతీ బ్యాచ్ నుంచి యువకులతో రక్తదానం చేయిస్తూ సరికొత్త సంప్రదాయానికి నాంది పలికామన్నారు. రక్తదానంపై ఉన్న అపోహలు వీడాలన్నారు. మొత్తం 35 యూనిట్ల రక్తం సేకరించినట్లు రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్‌లు తెలిపారు.

పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరిశారు..

- పలుచోట్ల శతశాతం ఉత్తీర్ణత
- ప్రైవేట్ పాఠశాలల కన్నా మెరుగైన ఫలితాలు
- ఆనందోత్సాల నడుమ విద్యార్థుల తల్లిదండ్రులు



ఎం. వందిత, 582

విజయనగరం పూల్‌బాగ్: పూల్‌బాగ్‌లోని మోడల్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించారు. మోడల్ స్కూల్ నుంచి 94 మంది పరీక్షలకు హాజరు కాగా 91 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రుక్సానా ఫర్వీన్ తెలిపారు. ఎం. వందిత 582.. కె. పూజిత 578.. కె. భవానీ 576.. కె. భావన 575.. ఆర్. కృష్ణకార్తీక్ 571 మార్కులతో మెరిశారు. అలాగే 47 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

సాయి భవ్యకు 594 మార్కులు



సాయిభవ్య



కెళ్ల కావ్యశ్రీ, 576

పూసపాటిరేగ: మండలంలోని చల్లంనాయుడువలసకు చెందిన కొట్టాన సాయిభవ్య 594 మార్కులు సాధించింది. ఈమె తల్లి కె.నీలిమ పూసపాటిరేగ మండల వ్యవసాయ అధికారి కాగా, తండ్రి కె. తేజేశ్వరరావు అల్లూరి సీతారామరాజు జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. సాయిబవ్యకు అత్యధిక మార్కులు రావడంతో గ్రామస్తులు అభినందించారు. అలాగే పూసపాటిరేగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కెళ్ల కావ్యశ్రీ 576 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. కుమిలి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన దేవరపు వేదశ్రీ వెంకట రాజేశ్వరి 573.. పసపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె. శ్యామల 561 మార్కులు సాధించారు.



588 మార్కులు సాధించిన ఎల్. భావనను అభినందిస్తున్న ఎంఈఓలు రమణమూర్తి, చంద్రమౌళి

శతశాతం ఉత్తీర్ణత..



సీహెచ్ మంజులాదేవి, 586

భోగాపురం: మండలంలోని పోలిపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 71 మంది విద్యార్థులకు గాను అందరూ ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా ఆదర్శ పాఠశాలలో చదువుతున్న 96 మంది విద్యార్థులకు గాను 95 మంది పాసయ్యారు. ఈ పాఠశాలకు చెందిన ఎల్.భావన 588, కేజీబీవీకి చెందిన సీహెచ్ ముంజులాదేవి 586 మార్కులు సాధించారు.

77 మందికి 77 మంది..

నెల్లిమర్ల: పట్టణంలోని ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ స్కూల్ విద్యార్థులు అందరూ పాసయ్యారని ప్రిన్సిపాల్ సీహెచ్ రమామోహని తెలిపారు. 77 మందికి అందరూ ఉత్తీర్ణత సాధించారు. కె.ధరణి 585..జె. ప్రవళ్లిక 572.. బి. మానస 569 మార్కులతో మెరిసారు. బొప్పడాం హైస్కూల్‌లో చదువుతున్న చంద్రకేశ్వరి 584.. సారిపల్లిలో చరణ్ తేజ 580.. పుణీత్‌కృష్ణ 553.. మొయిదలో లావణ్య 568.. శాంతికుమారి 566.. పారసాం సౌజన్య 576.. ఆకాష్ 575.. కొండవెలగాడలో కార్తీక్ 555.. వర్షిత 550 చొప్పున మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు.

ఉత్తమ ఫలితాలు



పతివాడ సాయి కుమార్, 576



పి. సిరి, 572



వి. తనుశ్రీ, 567



మోపాడ మహతి, 561



దాడిశెట్టి శ్యామల, 561

డెంకాడ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధించాయి. అక్కివరం పంచాయతీ గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి పతివాడ సాయికుమార్ 576 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం సాధించాడు. అలాగే పెదతాడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.సిరి 572.. మోడల్ స్కూల్ విద్యార్థులు వి.తనుశ్రీ 567.. మోపాడ మహతి, దాడిశెట్టి శ్యామల 561 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. మోడల్ స్కూల్‌లో 97 మందికి గాను 93 మంది ఉత్తీర్ణత సాధించారు. పెదతాడివాడ ఉన్నత పాఠశాలలో 79 మంది.. అక్కివరం ఉన్నత పాఠశాలలో 30 మంది.. జొన్నాడ పాఠశాలలో 58 మంది.. మోపాడ ఉన్నత పాఠశాలలో 58 మంది.. కేజీబీవీలో 33 మంది.. రఘుమండ ఉన్నత పాఠశాలలో 52 మంది.. గుణుపూరుపేట ఉన్నత పాఠశాలలో 39 మంది.. డెంకాడ ఉన్నత పాఠశాలలో 51 మంది ఉత్తీర్ణులయ్యారు.

వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు



నగరంలోని పీడబ్ల్యూ మార్కెట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- విజయనగరం ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలంటే వైఎస్సార్‌సీపీతోనే సాధ్యపడుతుందని డిప్యూటీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ విజయనగరం అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని పీడబ్ల్యూ మార్కెట్లో సోమవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉత్సాహభరిత వాతావరణంలో సాగిన ప్రచారంలో వ్యాపారులు పాల్గొని, సంఘీభావం తెలిపారు. ముందుగా ఆయనకు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, మరోసారి తనకు శాసనసభ్యుడిగా అవకాశం ఇస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి కంటుభుక్త తవిటిరాజు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి కాపుగంటి ప్రకాష్ మాట్లాడుతూ.. కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో ఈ ఐదేళ్ల కాలంలో నగరం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించడమే కాకుండా వర్తక, వాణిజ్య రంగాల వారికి అండగా నిలిచారని కొనియాడారు. రామారాయుడు రోడ్డు అభివృద్ధికి చొరవ చూపారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తే... స్థానికంగా కోలగట్ల వీరభద్రస్వామి అభివృద్ధి కొనసాగించారన్నారు. రానున్న ఎన్నికలలో మరోసారి కోలగట్ల వీరభద్రస్వామిని గెలిపిస్తే నగరం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కేదారిశెట్టి సీతారామమూర్తి, ఉసిరికల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టాలి



జరజాపుపేటలో ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స
- జరజాపు పేటలో చురుగ్గా ఎన్నికల ప్రచారం

నెల్లిమర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని చూసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మరోసారి పట్టం కట్టాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు కోరారు. నెల్లిమర్ల నగర పంచాయతీ జరజాపుపేటలో నియోజకవర్గ పరిశీలకుడు నెక్కల నాయుడుబాబు, పార్టీ మండల అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, నగర అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, తదితరులతో కలిసి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమం వివరించారు. ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకోవడానికి జనసేన, టీడీపీ నాయకులు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని ఆరోపించారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసిన జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, నగర పంచాయతీ వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకటకృష్ణారావు, వైస్ ఎంపీపీలు సారిక వైకుంఠం, పతివాడ సత్యనారాయణ, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, అవనాపు విక్రమ్, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు రేగాన శ్రీనివాసరావు, మద్దిల వాసు, నౌపాడ శ్రీనివాసరావు, నాయకులు పతివాడ అప్పారావు, మాతా నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

అభిమన్యుకు 581..



అభిమన్యును ముద్దాడుతున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి (ఫైల్)



బొప్పడాం ఉన్నత పాఠశాలలో అభిమన్యును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నెల్లిమర్ల రూరల్: నాలుగేళ్ల కిందట జిల్లా కేంద్రంలో జరిగిన జగనన్న వసతిదీవెన కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హాజరైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో ఏ విధమైన మార్పులు వచ్చాయి..? పాఠశాలలు ఏ విధంగా అభివృద్ధి చెందాయి..? బ్యాగులు, పుస్తకాలు, జగనన్న అమ్మఒడి, ఆంగ్ల విద్య, తదితర అంశాలపై బొప్పడాం ఉన్నత పాఠశాలలో అప్పటి ఆరో తరగతి విద్యార్థి చందక అభిమన్యు ఇంగ్లిష్‌లో స్పీచ్ అదరగొట్టాడు. చిన్న వయసులోనే అనర్గళంగా మాట్లాడిన అభిమన్యును సీఎం జగన్ మోహన్ రెడ్డి దగ్గరకు తీసుకొని, చెంపపై ముద్దాడి అభినందించారు. అభిమన్యు మాట్లాడిన వీడియో ఇప్పటికి కూడా యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లోనే ఉంది. ఇటీవల పదో తరగతి పరీక్షలు రాసిన అభిమన్యు 581 మార్కులు సాధించి పాఠశాల టాపర్లలో ఒకడిగా నిలిచాడు. దీంతో హెచ్‌ఎమ్ నగేష్, సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

సేవా కార్యక్రమాలతోనే గుర్తింపు



క్లబ్ ప్రతినిధులకు అవార్డు అందజేస్తున్న క్లబ్ పూర్వ గవర్నర్ కర్రోతు సత్యం

విజయనగరం: సేవా కార్యక్రమాలే స్వచ్ఛంద సంస్థలకు గుర్తింపును తీసుకువస్తాయని వాకర్స్ క్లబ్ పూర్వపు గవర్నర్ కర్రోతు సత్యం అన్నారు. సోమవారం స్థానిక గుండాలవారి వీధిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి స్థానిక వనితా వాకర్స్ క్లబ్ ఫోర్టు శాఖకు వచ్చిన అవార్డు, జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్లబ్ ద్వారా ముళ్లపూడి సుభద్రాదేవి ఎన్నో విశేష సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. నెల్లిమర్ల మండల విద్యాశాఖ అధికారి, వాకర్స్ క్లబ్ ప్రతినిధి ఈపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. వనితా వాకర్స్ క్లబ్ ఫోర్టు శాఖ ప్రతినిధులు సామాజికపరంగా అందిస్తున్న సేవలు శ్లాఘనీయమని కొనియాడారు. ముళ్లపూడి సుభద్రాదేవి మాట్లాడుతూ, క్లబ్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలను గుర్తించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు సీహెచ్ సాయి సంతోషిణి, కార్యదర్శి సీహెచ్ పార్వతి, కోశాధికారి సత్యలత, తదితరులు పాల్గొన్నారు.

సైక్రియాట్రిస్ట్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీరామ్మూర్తి

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని సాయి ఆస్పత్రిలో ఉచితంగా అందిస్తున్న సైకియాట్రిక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సాయి ఆస్పత్రి ఎం.డి డాక్టర్ అక్కెన శ్రీరామ్మూర్తి తెలిపారు. న్యూరో సైకియాట్రిస్ట్ సేవలను సోమవారం ఆయన ప్రారంభిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విశాఖకు చెందిన సైకియాట్రిస్ట్ డాక్టర్ నిహాల్ సాయి ఆస్పత్రిలో సేవలు అందిస్తారని తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిధిలో లేని వివిధ రకాల చికిత్సలను సైతం సాయి ట్రస్టు ద్వారా ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నిహాల్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకుడు సురేష్

బాడంగి: మండలంలోని పాల్తేరు గ్రామపంచాయతీ కార్యదర్శి భవానిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నేత ఎ.సురేష్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి సోమవారం చేరుకుని, ఎంపీడీవో ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఐదు నెలల పాటు ఆమె విధులకు గైర్హాజరయ్యారని, దీంతో భీమవరం పంచాయతీ కార్యదర్శి మహేశ్వరరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారన్నారు. ఇప్పుడు మళ్లీ ఆమెను విధుల్లోకి ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. ఆమె విధులకు డుమ్మా కొట్టిన విషయాన్ని ఈవోపీఆర్‌డీ, ఎంపీడీవోలకు గతంలో ఫిర్యాదులు చేయగా, మెమోలు జారీచేశామన్నారన్నారు. ఆమె ఎందుకు విధులకు రావడం లేదో కనీసం ఫోన్‌లో ఎటువంటి సమాచారం ఇవ్వని ఆమెను మళ్లీ ఉద్యోగంలో ఎలా చేరనిచ్చారన్నారు. స్పందించిన ఎంపీడీవో.. ఆరోగ్యం బాగాలేకపోవడంతోనే విధులకు రాలేకపోయినట్లు ఆమె తెలిపారని, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కూడా ఇస్తానని ఆమె చెప్పడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధుల్లోకి ఆమెను చేర్చుకున్నామన్నారు.

25న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

విజయనగరం టౌన్: పట్టణంలోని టీటీడీ కల్యాణ మంటపంలో కొలువైన వేంకటేశ్వర స్వామి ఆలయ 15వ వార్షికోత్సవం ఈ నెల 25న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ ధర్మకర్త నారాయణం శ్రీనివాస్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 7 గంటల నుంచి స్వామివారికి అభిషేకాలు, సుదర్శన హోమం, పూర్ణాహుతి.. సాయంత్రం 5.30 గంటలకు స్వామి వారి వార్షిక కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులందరూ స్వామివారిని దర్శించి, తరించాలని కోరారు.

నేడు పుస్తకాల పంపిణీ

విజయనగరం టౌన్: ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉదయం 10 గంటల నుంచి గురజాడ స్వగృహంలో పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు సహజ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు ఎన్‌కే బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుస్తక ప్రేమికులందరూ తమకు నచ్చిన పుస్తకాన్ని ఉచితంగా తీసుకోవచ్చన్నారు.

ముగ్గురికి తీవ్రగాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

బొబ్బిలి: మండలంలోని జగన్నాథపురం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. గాయాలపాలైన వారిలో పార్వతీపురం మన్యం జిల్లా, సీతానగరం మండలంలోని పెదంకలాం గ్రామానికి చెందిన మరిశర్ల గణేష్, గొర్లి నారాయణలతో పాటు బొబ్బిలికి చెందిన బంటు నారాయణ ఉన్నారు. ఏఎస్ఐ జి.భాస్కరరావు తెలిపిన వివరాలిలా.. వారంతా బొబ్బిలి మండల కేంద్రంలో నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బేబీ నాయన నిర్వహించిన ర్యాలీలో పాల్గొని, బైక్‌పై పెదంకలాం వెళ్తుండగా, గ్యాస్ ట్యాంకర్ ఢీకొనడంతో దుర్ఘటన జరిగిందన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, వైద్యసేవల నిమిత్తం 108 అంబులెన్స్‌లో బొబ్బిలి సీహెచ్‌సీకి క్షతగాత్రులను తరలించడం జరిగిందన్నారు.

నెల్లిమర్లలో మరో మూడు నామినేషన్లు

నెల్లిమర్ల: నెల్లిమర్ల అసెంబ్లీ స్థానానికి సోమవారం మూడు నామినేషన్లు దాఖలైనట్లు ఆర్‌ఓ ఎం. నూకరాజు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీఎస్పీ నుంచి ఎరుకొండ తేజారాణి, సమాజ్‌వాదీ పార్టీ నుంచి కర్రి చిన్నారి, రిఫార్మ్స్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి అదపాక సూరిబాబు నామినేషన్లు వేశారని చెప్పారు. ఇప్పటి వరకు మొత్తంగా ఏడు నామినేషన్లు దాఖలైనట్లు తెలిపారు.

- నాలుగు నామినేషన్లు

విజయనగరం రూరల్: విజయనగరం అసెంబ్లీ స్థానానికి నాలుగో రోజైన సోమవారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ తెలిపారు. అఖిల భారతీయ జన సంఘ్ నుంచి పోలుపల్లి కిరణ్ కుమార్.. సమాజ్‌వాదీ పార్టీ నుంచి పెనుమత్స కిరణ్‌కుమార్ రెండు నామినేషన్లు దాఖలు చేశారన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా పడాల ఆదినారాయణ నామినేషన్ దాఖలు చేశారని ఆయన తెలిపారు. ఇప్పటివరకు 18 నామినేషన్లు దాఖలయ్యాయన్నారు.

సీఎం సభ విజయవంతం చేయాలి



నాయకులతో మాట్లాడుతున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: మండలంలోని చెల్లూరు గ్రామం వద్ద మంగళవారం జరగనున్న మేమంతా సిద్ధం సభకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మండల ప్రజలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎంపీపీ మామిడి అప్పనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని మలిచర్లలో మండల నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోసర సన్నిబాబు, తుమ్మగంటి రామునాయుడు, దుర్గరాజు, మస్తాన్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

వేపాడ: మండలంలోని సోంపురం ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని హెచ్‌ఎం బి.పి.ఏ.రాజు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించా రు. 2023–24 విద్యాసంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల తో సందడి చేశారు. వాలీ,సుగ్రీవులు, ద్రౌపది స్వయంవరం, లవకుశ, కనువిప్పు అనే నాటికలు ప్రదర్శించారు. అలాగే ధరిత్రి దినోత్సవం సందర్భంగా వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

అండగా ఉన్నవారిని గెలిపించండి

- వైఎస్సార్‌సీపీ నాయకులు



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మెరకముడిదాం: ప్రజలకు అందుబాటులో ఉంటూ, కష్టసుఖాల్లో పాలుపంచుకునే వారిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఎస్‌వీ రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, సంగంరెడ్డి వెంకటలక్ష్మి, కేఎస్‌ఆర్‌కే ప్రసాద్ కోరారు. మండలంలోని సోమలింగాపురం పంచాయతీ మధుర గ్రామమైన గొళ్లల మర్రివలసలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంపీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే అభ్యర్థి బొత్స సత్యనారాయణలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఎస్. సీతారామరాజు, తదితరులు పాల్గొన్నారు.